


# శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

సిర్పూర్(టీ), అక్టోబర్ 7 : మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో సోమవారం సిర్పూర్(టీ) మాజీ ఎమ్మెల్యే కోనప్ప రమాదేవి శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యేటా బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారికి పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. ఆమె వెంట మాజీ ఉప సర్పంచ్ తోట మహేశ్, నాయకులు బొమ్మన శ్రీనివాస్, మొర్రాయి తిరుపతి పాల్గొన్నారు.



వెంకటేశ్వరాలయంలో శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కోనేరు రమాదేవి

# బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

మందమర్రి, అక్టోబర్ 7 : మందమర్రి ఏరియాలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఏరియా జీఎం జీ దేవేందర్ అధికారులకు సూచించారు. జనరల్ మేనేజర్ కార్యాలయ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో సోమవారం ఏర్పాటు చేసిన సమీక్షాసమావేశంలో పలు సూచనలు చేశారు. లోటుపాట్లు లేకుండా ఘనంగా నిర్వహించాలన్నారు. సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించనున్న ఫ్యామిలీ డే వేడుకల్లో సింగరేణి సేవా సమితి, లేడీస్ క్లబ్ సభ్యులు, మందమర్రి పట్టణంతో పాటు పరిసర గ్రామాల మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సద్దుల బతుకమ్మ వేడుకల నిర్వహణకు స్థానిక సింగరేణి పాఠశాల మైదానం, రామకృష్ణాపూర్ లోని ఠాగూర్ స్టేడియం సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, కేకే గ్రూప్ ఏజెంట్ రామదాసు, ఆర్కే ఓసీపీ ఆఫీసర్ గోవిందరావు, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, డీజీఎం(సివిల్) శ్రీనివాసులు, డీవైపీఎం ఎండీ ఆసీఫ్, మేనేజర్లు పాల్గొన్నారు.

## వేడుకలు విజయవంతం చేయండి

రెబ్బెన, అక్టోబర్ 7 : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సింగరేణి స్కూల్ గ్రౌండ్, మదారం రామాలయ ప్రాంగణంలో సద్దుల బతుకమ్మ(ఫ్యామిలీ డే) వేడుకలు విజయవంతం చేయాలని జీఎం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందంగా అలంకరించిన బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు, మరో పది బతుకమ్మలకు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమయ్యే వేడుకలకు కార్మికులు, కార్మికుల కుటుంబాలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న మందమర్రి ఏరియా జీఎం దేవేందర్



గుండ్లపాడు గుట్టను జేసీబీని తవ్వి లారీలో నింపుతున్న మొరం



గుండ్లపాడ్ గుట్టన జేసీబీతో తవ్వుతూ లారీల్లో తరలిస్తున్న మొరం

# గుండ్లపాడ్ గుట్ట ధ్వంసం

- జేసీబీతో తవ్వకాలు.. నిత్యం లారీల్లో మొరం తరలింపు
- అధికారుల తీరుపై విమర్శలు

కాసిపేట, అక్టోబర్ 7 : ముత్యంపల్లి పంచాయతీలోని గుండ్లపాడ్ గుట్ట కనుమరుగవుతున్నది. సహజ వనరులను రక్షించాల్సిన అధికారులే మొరం తవ్వకాలకు అనుమతులివ్వడంతో పచ్చని కొండ ధ్వంసమవుతున్నది. స్థానికులు అడ్డుకొని ఒక రోజు పనులు నిలిపివేసినా, అనుమతులున్నాయని అధికారులు భయభ్రాంతులకు గురి చేసినట్లు తెలిసింది. జేసీబీతో గుట్టపై మొరం తవ్వకాలు చేపడుతుండగా, నిత్యం పదుల సంఖ్యలో లారీల్లో తరలిపోతున్నది. గతంలో కూడా పలువురు కాంట్రాక్టర్లు రోడ్డు పనుల కోసమని గుట్టను తవ్వి భారీగా మొరం తరలించగా స్థానికులు వ్యతిరేకించడం, ఆరోపణలు రావడంతో నిలిపివేశారు. కొన్ని నెలలు స్తబ్ధుగా ఉన్న కాంట్రాక్టర్లు మళ్లీ కొత్త రైల్వే లైన్ పనుల కోసమని అనుమతులు పొంది లారీల్లో భారీగా మొరం తరలిస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో చాలా వరకు ప్రభుత్వ భూమి ఉండగా, అక్కడకాకుండా కేవలం గుట్టను తవ్వేందుకు అనుమతులివ్వడంపై ప్రకృతి ప్రేమికులు మండిపడుతున్నారు. ఇకనైనా సహజ వనులను కాపాడాలని, ఈ విధ్వంసాన్ని ఆపాలని, అనుమతులు నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

# గనులపై అమ్మవారికి పూజలు

శ్రీరాంపూర్, అక్టోబర్ 7 : శ్రీరాంపూర్ ఏరియాలోని గనులపై దేవీ శరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. శ్రీరాంపూర్ ఓసీపీపై పీవో టీ శ్రీనివాస్ దంపతులు శాంతి హోమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆర్కే–6 గనిపై మైసమ్మ దేవాలయంలో దుర్గా మల్లిఖార్జునస్వామి కళ్యాణ మహోత్సవంలో మేనేజర్ తిరుపతి దంపతులు పాల్గొని, పూజలు చేశారు. సేఫ్టీ జీఎం రఘుకుమార్, సేఫ్టీ ఆఫీసర్ కాదాసి శ్రీనివాస్, సర్వే ఆఫీసర్ ఎస్‌పీ వర్మ, ఈఈ మహేశ్, సీనియర్ పీవో సురేందర్, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, పిట్ కార్యదర్శి సంఘం సదానందం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జైపూర్, అక్టోబర్ 7 : శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారంఖని–1ఏ దుర్గామాత ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి ఏ వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. జీఎం సేఫ్టీ రఘుకుమార్, ఏజీఎం ఫైనాన్స్ వెంకటేశ్వర్లు, డీజీఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, అక్టోబర్ 7 : బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీ వద్ద దుర్గామాత ఆలయంలో జీఎం శ్రీనివాస్–ఉమారాణి దంపతులు, ప్రాజెక్టు అధికారి మచ్చగిరి నరేందర్–నళిని దంపతులు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఉపాధ్యక్షుడు భయ్యా మొగిలి, గని మేనేజర్ శంకర్, ఎస్వో రాజేశ్వర్‌రావు, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆలయ కార్యదర్శి చంద్రశేఖర్ ప్రత్యేక పూజలు చేశారు.



ఆర్కే 6పై శాంతి హోమంలో మేనేజర్ తిరుపతి దంపతులు



ఖైర్‌గూడ ఓసీపీలో హోమం చేస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ దంపతులు

# ఉద్యోగం పేరిట మోసం

ఐదుగురిపై చీటింగ్ కేసు

నెన్నెల, అక్టోబర్ 7 : ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బు తీసుకొని ఓ మహిళను మోసం చేసిన ఘటన నెన్నెలలో చోటుచేసుకున్నది. ఈ మేరకు ఐదుగురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..నెన్నెలకు చెందిన ఎరుకల బాపు స్థానిక జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యాంజలి పథకం ద్వారా అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని, అందుకు రూ.1.36 లక్షలు ఖర్చవుతాయని చెప్పి బూరం స్వర్ణలత వద్ద గత జూలై 1న డబ్బు తీసుకున్నాడు. ఎరుకల బాపు(నెన్నెల), కొంటు శ్రీనివాస్(మందమర్రి), తిరుమల్(గోదావరిఖని), పిడుగు రవీందర్ (పెద్దపల్లి) కలిసి అపాయింట్‌లెటర్ ఇచ్చారు. స్వర్ణలతతో కలిసి ఆ లెటర్‌తో పాఠశాలకు వెళ్లి, హెచ్‌ఎంకు అందజేశారు. అప్పటి నుంచి రోజు పాఠశాలకు వెళ్లి పనులు చేస్తున్నది. ఆగస్టు 10వ తేదీ వరకు నెల దాటినా వేతనం రాక పోయే సరికి హెచ్‌ఎంను అడిగింది. ఇప్పటి వరకు డీఈవో నుంచి అనుమతి రాలేదని, అనుమతి వస్తే జీతం వస్తుందని చెప్పాడు. దీంతో ఉద్యోగం పెట్టించిన వారిని డీఈవో పర్మిషన్ కావాలని అడిగింది. రేపుమాపూ అంటూ తిప్పుకున్నారు. విసుగు చెందిన స్వర్ణలత.. తనకు ఉద్యోగం వద్దని, ఇచ్చిన డబ్బు కావాలని వారిని నిలదీసింది. దీంతో వారు యాక్సిస్ బ్యాంక్ పేరిట రూ.1.36 లక్షల చెక్కును స్వర్ణలతకు ఇచ్చారు. ఆమె నెన్నెల గ్రామీణ బ్యాంక్‌లో చెక్ డిపాజిట్ చేసింది. చెక్‌పై తప్పుడు సంతకాలు చేశారని బ్యాంకు వారు ఆమెకు రూ.వెయ్యి ఫైన్ వేశారు. దీంతో మోసపోయానని గ్రహించి.. బాపు, శ్రీనివాస్, తిరుమల్, రవీందర్‌తో పాటు హెచ్‌ఎంపై నెన్నెల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# డీఎస్సీ అభ్యర్థులను తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉండాలి

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 7 : డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లో 9న సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారని, వారిని తీసుకువెళ్లేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా నుంచి అభ్యర్థులను తీసుకువెళ్లేందుకు కండీషన్‌లో ఉన్న 7బస్సులను సిద్ధంగా ఉంచాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌ను ఆదేశించారు. ప్రతీ బస్సులో మెడికల్ కిట్, తాగునీరు, పండ్లు ఉంచాలని, ప్రతి బస్సుకు ఓ కానిస్టేబుల్‌ను నియమించాలన్నారు. అభ్యర్థులు ముందు రోజు (8వ తేదీన) సాయంత్రం వరకు జిల్లా కేంద్రానికి చేరుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వారికి జిల్లా కేంద్రంలో వివిధ వసతి గృహాలల్లో బస ఏర్పాటు చేయాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. 9వ తేదీ ఉదయం 4 గంటలకు బస్సులు బయలుదేరాలని, ప్రయాణం మధ్యలో అల్పాహారం ఏర్పాట్లు చేయాలని సహకార శాఖ అధికారికి సూచించారు. అభ్యర్థులను సురక్షితంగా తీసుకెళ్లి, నియామక పత్రాలు తీసుకున్న తర్వాత తిరిగి ఇంటికి చేరుకునేలా ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని తెలిపారు.

# కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

శ్రీరాంపూర్, అక్టోబర్ 7 : నస్పూర్ మున్సిపాలిటీలోని కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తలారి రాజు, నస్పూర్ పట్టణాధ్యక్షుడు గరిగంటి రాజయ్య డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఆర్కే–6 గుడిసెల్లోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీలో 130 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు, 86 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. 5 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

# దాడి చేసిన వారిపై కేసు

నెన్నెల, అక్టోబర్ 7 : రోడ్డుకు అడ్డంగా ఉన్న బైకులను తీయాలని అడిగితే దాడిచేసి, గాయపర్చిన కాసిపేటకు చెందిన ముదాం అనిల్, ముదాం సాగర్, అస్ప సంజయ్, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఘన్‌పూర్‌కు చెందిన అంగలి శేఖర్, వెంకటేశ్ ఆదివారం రాత్రి నెన్నెలకు ఎరువుల దుకానికి వచ్చి, ఇంటికి వస్తున్నారు. నెన్నెలలోని వైన్‌షాప్ ఎదుట రోడ్డుకు అడ్డంగా పెట్టి ఉన్న బైకులను తీయాలని అడిగారు. అక్కడే ఉన్న తాండూర్ మండలం కాసిపేటకు చెందిన పలువురు తాగిన మైకంలో శేఖర్, వెంకటస్వామిని తిట్టి, కర్రలతో దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# రిటైర్డ్ కార్మికులకూ లాభాల వాటా ఇవ్వాలి

శ్రీరాంపూర్, అక్టోబర్ 7 : సింగరేణిలో 2023–24లో పనిచేసి విరమణ పొందిన కార్మికులకు రావాల్సిన లాభాల వాటా కార్మికులతో పాటే చెల్లించాలని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రిటైర్డ్ కార్మికులకు, మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికులకు చెల్లించాలని, అలాగే దీపావళి బోనస్ కూడా ఇవ్వాలని పేర్కొన్నారు. రిటైర్డ్, మెడికల్ అన్‌ఫిట్ కార్మికలపై యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు.



ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా